క్లుప్తంగా

గిట్టుబాటు ధరకే ధాన్యం విక్రయించుకోవాలి

జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



చినలింగాయపాలెం(కాకుమాను): రైతులు ఆరుగాల కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్ముకుని నష్టపోకుండా గిట్టుబాటు ధరకే విక్రయించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ సూచించారు. మండలంలోని చినలింగాయపాలెం గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులెవరూ ధాన్యాన్ని బయట విక్రయించకుండా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలోనే విక్రయించుకుని కనీస మద్దతు ధర పొందాలని సూచించారు. తహసీల్దార్ బి.వెంకటస్వామి, ఏఓ కె.కిరణ్మయి, రైతులు, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ప్రగడ కోటయ్యకు ఘననివాళి

పొన్నూరు: నిడుబ్రోలు వీవర్స్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాబంధు ప్రగడ కోటయ్య 29వ వర్ధంతి నిర్వహించారు. వీవర్స్ కాలనీలోని ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేనేతలకు అందించిన సేవలను కొనియాడారు. సొసైటీ మాజీ చైర్మన్ ప్రగడ వీరభద్ర బాలాజీ, బీసీ నాయకులు మాకాని రమేష్, ఆరె వెంకట్రావు, చేనేత కార్మికులు, సొసైటీ మేనేజరు బాజీ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ‘పొలం పిలుస్తోంది’

రావిపాడు(కాకుమాను): పత్తి సాగుచేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ సుధారాణి అన్నారు. మండలంలోని రావిపాడు, గోగులమూడి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ పత్తి రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి వారి సూచనల మేరకు పురుగు మందులు వాడాలని తెలిపారు. ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పొన్నూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ వి.రామకోటేశ్వరి తెలిపారు. మండలంలోని ములుకుదురు, చింతలపూడి రైతు సేవ కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల నుంచి ఎంటీయూ 1224 రకం ధాన్యాన్ని మంగళవారం కొనుగోలు చేశారు. తేమశాతం 17 ఉండి, ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని క్వింటాలు రూ. 2320, 75 కేజీల బస్తా రూ.1740కు ఏ గ్రేడ్ కింద కొనుగోలు చేసినట్లు ఏడీఏ తెలిపారు. గోనె సంచులు, హమాలీ చార్జీలు, రవాణా చార్జీలు అందిస్తున్నట్లు తెలిపారు. ఏఓ వెంకట్రామయ్య, వీఆర్ఓ కరిముల్లా, రైతులు పాల్గొన్నారు.

శనగ రైతులు సూచనలు పాటించాలి

గుంటూరు రూరల్: రైతులు శనగ విత్తనాలు విత్తుకున్న తరువాత పరోక్వాట్ కలుపు మందును వినియోగించరాదని, విత్తిన తరువాత 20 రోజులకు కలుపు నివారణకు వాడే కలుపు మందులు ఇంకా పరిశోధనలోనే ఉన్నాయని లాంఫాం ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ ఎన్. వెంకటలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తిన వెంటనే 24 గంటలలోపు పెండిమిథాలిన్ 1-1, 1.2 లీటర్లు చొప్పున ఎకరానికి పిచికారీ చేస్తే కలుపును పంట తొలిదశలో సమర్ధవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. పైరు విత్తిన తరువాత 30 రోజుల వరకూ పొలంలో కలుపు లేకుండా చూసుకోవాలని, గొర్రుతో అంతరకృషి చేసి అవసరమైతే కూలీలతో కలుపు తీయించుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలను రైతులు పాటించి పంటలను కాపాడుకోవాలని తెలిపారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

పెదకాకాని: ఇంజినీరింగ్ పనులు చూసుకోవాల్సిన తాము నాన్ ఇంజినీరింగ్ వర్క్‌లతో సతమతమవుతున్నామని మండల సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదకాకాని మండలంలోని సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లుగా విధులు నిర్వహిస్తున వారందరూ సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం తహసీల్దార్, ఎంపీడీఓలను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.జాన్‌వెస్లీ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులను దగ్గర ఉండి పర్యవేక్షించి, ఎం.బుక్ నమోదు, పని నాణ్యతపై పూర్తి బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ పై ఉందన్నారు. అందుకు భిన్నంగా పెదకాకానిలో ఫీల్డ్ స్థాయిలో అది జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె పండుగ, జిల్లా పరిషత్, మండల గ్రాంట్స్ వర్కులు పూర్తి అయ్యేవరకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నాన్ టెక్నికల్ వర్క్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. మండల అసోసియేట్ ప్రెసిడెంట్ టి శ్రీనివాస్, మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

గౌరవం ఎక్కడ..?!

- వాడుకలో లేని కమ్యూనిటీ టాయిలెట్లు
- నిర్వహణ లేక అధ్వానంగా మరుగుదొడ్లు
- అవగాహన కార్యక్రమాలూ అంతంత మాత్రమే..



యనమదలలో తలుపులు కూడా లేని సీఎస్‌సీ కాంప్లెక్స్

ప్రత్తిపాడు: ‘మా టాయిలెట్ మా గౌరవం’ అంటూ నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మరుగుదొడ్ల ఆవశ్యకతను తెలియజేసేందుకు నవంబర్ 19 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ‘మా టాయిలెట్ మా గౌరవం’ (హమారా సౌచలే హమారా సమ్మాన్) పేరుతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన కార్యక్రమాల షెడ్యూల్‌ను నిర్దేశించింది. ఇందులో భాగంగా నవంబరు 14 నుంచి 18 వరకు సన్నాహక సమావేశాలు, వాడుకలో లేని కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను గుర్తించి, వాటిని ఉపయోగంలోనికి తీసుకురావడం, 19న వరల్డ్ టాయిలెట్ డే ప్రచారం ప్రారంభించి డిసెంబర్ 5వ తేదీ వరకు కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల మరమ్మతులు చేయించి రంగులతో సుందరీకరించాలి. వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కమ్యూనిటీలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి. 5 నుంచి 10వ తేదీ వరకు వ్యక్తిగత మరుగుదొడ్లు, సామూహిక మరుగుదొడ్లు సర్వేను ముగించి, వినియోగంలో ఉన్న ఉత్తమమైన వాటిని గుర్తించాలి. 10వ తేదీ ముగింపు కార్యక్రమంలో గుర్తించిన ఉన్నతమమైన మరుగుదొడ్ల నిర్వాహకులకు బహుమతులు అందించాలి. కానీ ఈ కార్యక్రమాల ఊసే కనిపించడం లేదు. తొలిరోజు మొక్కుబడిగా అక్కడక్కడా ర్యాలీలు జరిపి, పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి చేసిమమ అనిపించేశారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం సంగతి ఎలా ఉన్నా, ప్రభుత్వం నిర్మించిన టాయిలెట్లు ఇలా నిరుపయోగంగా పడి ఉండటంతో సూక్తులు చెప్పేందుకే గానీ ఆచరణకు కాదన్నట్లు అధికారుల తీరు ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి.





ఈదులపాలెం ఎస్‌డబ్ల్యూపీసీ సమీపంలో నిరుపయోగంగా కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్

‘మరుగు’న పడేశారు..

ప్రత్తిపాడు మండలంలో అధికారుల ఆలసత్వం కారణంగా లక్ష్యం పూర్తిగా ‘మరుగు’న పడుతుంది. వలస కూలీలు, ప్రజల కోసం నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లు గ్రామ పంచాయతీల నిర్వహణ సక్రమంగా లేక వృథాగా మారాయి. సచివాలయాల వద్ద ఒక్కో యూనిట్ ను సుమారు రూ. 3 లక్షల వ్యయంతో నిర్మించారు.

- ఈదులపాలెం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ సమీపంలో వలస కూలీల సౌకర్యార్థం నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు యూనిట్ నిరుపయోగంగా పడి ఉన్నాయి. సంవత్సరాలుగా పట్టించుకున్న నాథులే లేరు. నిర్మించి నిరుపయోగంగా వదిలేశారు.
- ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న సీఎస్సీతో పాటు, నడింపాలెం, పెదగొట్టిపాడుల్లో ఉన్న కాంప్లెక్స్‌లకు మరమ్మతులు చేసినప్పటికీ తాళాలు వేసి దర్శనమిస్తుండటంతో, వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుంది.
- యనమదలలో గ్రామ శివారుల్లో నిర్మించిన సీఎస్సీ అధ్వానంగా తయారయ్యింది. పట్టించుకునే వారు లేకపోవడంతో మరుగుదొడ్ల లోపల పిచ్చి మొక్కలు పెరిగాయి. మరికొన్నింటిలో అధ్వానంగా ఉన్నాయి. కనీసం దొడ్లుకు తలుపులు కూడా లేని దుస్థితి.
- ఇక ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజా అవసరాల నిమిత్తం నిర్మించిన శానిటరీ కాంప్లెక్స్ కార్యాలయం వెనుక భాగంలో ఉండటంతో ఉందన్న సంగతి కూడా ప్రజలకు తెలియని పరిస్థితి.

నిర్వహణ బాధ్యత పంచాయతీలదే..

కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదే. మండలంలో ఉన్న ఒక్క శానిటరీ కాంప్లెక్స్ కూడా మొన్నటి వరకు వినియోగంలో లేదు. నిర్వహణ లోపం పంచాయతీలదే. ప్రస్తుతం ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. షెడ్యూల్‌లో భాగంగా కాంప్లెక్స్‌లను వినియోగంలోనికి తీసుకువస్తాం.

– వినీల్ కుమార్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ప్రత్తిపాడు మండలం

‘ప్రకృతి’ క్షేత్రాలను సందర్శించిన తెలంగాణ రైతులు



తెలంగాణ రైతులతో క్షేత్రస్థాయి సందర్శనలో ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు, స్థానిక రైతులు

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయానికి ఆకర్షితులైన తెలంగాణ రైతులను జొన్నలగడ్డ, లాం గ్రామాల్లోని పలు ప్రధాన పంటలు వాటి అంతర పంటల సాగు గురించి క్షేత్ర సందర్శనం బుధవారం నిర్వహించారు. ఆదర్శరైతు వంగా నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మిరప పంటలో ఉల్లి, బంతి, క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి లాంటి అంతర పంటలను రక్షక పంటలుగా సాగు చేస్తున్న విధానాలు పరిశీలించారు. జొన్న, సజ్జలను ప్రధాన పంటగా పండించే విధానంలో తీసుకునే మెలకువలు కషాయాల వినియోగం వాటి పనితీరులను గురించి తెలుసుకున్నారు. రైతునేస్తం ఫౌండేషన్‌లో ఉన్న ఏటీఎం మోడల్‌ను తెలంగాణ రైతులు సందర్శించి దాని ఉపయోగాలు దాని మీద వచ్చే ఆదాయ వివరాలు కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారిని రాజకుమారి మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానం ఎంతో మేలైందని, దీనివల్ల భూమి ఆరోగ్యంగా ఉండటమే కాకుండా రైతుకు అదనపు ఆదాయాలు, సమాజానికి మంచి ఆరోగ్యాన్ని అందించవచ్చన్నారు. తెలంగాణ రైతులు 25 మంది మూడు రోజులలో వివిధ పంటలు వాటి ఆదాయ వ్యయాలు రైతుల అనుభవాలను తెలుసుకుని తెలంగాణ రాష్ట్రంలో తాము ఈ విధానాన్ని పాటించి రాష్ట్రానికి పేరు తెచ్చుకోవాలని ఇందుకు సహకరించిన గుంటూరు జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగానికి కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమములో రైతులు, జొన్నల శ్రీనివాసరెడ్డి, ఝాన్సీ, లక్ష్మి, కోటేశ్వరరావు, తెలంగాణ రైతులు, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ ఎన్‌సీసీ క్యాడెట్లకు బెస్ట్ అవార్డులు



అవార్డులు అందుకున్న క్యాడెట్లను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: తమ కళాశాల విద్యార్థులు సాంకేతిక ప్రతిభలతో పాటు సామాజిక సేవలలోనూ పురస్కారాలు అందుకోవడం గర్వకారణమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన కార్యక్రమంలో కళాశాలకు చెందిన జూనియర్ అండర్ ఆఫీసర్ షేక్ మహమ్మద్ మహారాజ్ బాషా, సార్జంట్ రాజశేఖర్ అనే ఇద్దరు ఎన్‌సీసీ విద్యార్థులు గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్, ఆఫీసర్ ఇన్ కమాండింగ్ కల్నల్ నీరజ్‌కుమార్ చేతుల మీదుగా బెస్ట్ క్యాడెట్స్ అవార్డులను, ప్రశంసా పత్రాలను అందుకోవటం సంతోషకరమన్నారు. తమ విద్యార్థులు దేశ రక్షణ దళంలో మేజర్ ఆఫీసర్, కెప్టెన్ హోదాల్లో, నేవీ దళంలో సబ్ లెఫ్టినెంట్లుగా ఉన్నత స్థాయి హోదాలలో దేశ సేవలో ఉండటం తమ కళాశాలకే గర్వకారణమన్నారు. విద్యార్థి అభిరుచులకు అనుగుణంగా వారికి నిపుణులచే శిక్షణ అందించి వారికి ఉజ్వల భవిష్యత్తును అందించడమే తమ లక్ష్యమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. పురస్కారాలు అందుకున్న విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ తారచాంద్ తదితరులున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రత్తిపాడు: కోయవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ సీహెచ్ రమాదేవి మంగళవారం పరిశీలించారు. స్థానిక ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాలలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జడ్పీ పాఠశాలలో నిర్వహించిన హెచ్ఎంల సమావేశంలో ఎంఈవోలు రమాదేవి, జి. లీలారాణిలు మాట్లాడారు.

భారత రాజ్యాంగం ప్రపంచంలోనే పెద్దది

వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



ప్రత్తిపాడులో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బలసాని కిరణ్ కుమార్, పార్టీ నాయకులు

ప్రత్తిపాడు: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్దదని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్తిపాడు బస్టాండు సెంటరులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి బలసాని కిరణ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ దేశ,విదేశాలు తిరిగి రాజ్యాంగంపై అవగాహన పెంచుకుని రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పారు. బడుగు బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఉపయోగపడేలా రాజ్యాంగంలో అనేక అంశాలను పొందుపరిచారని చెప్పారు. ఆ మహనీయుని అడుగుజాడలను వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుసరిస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు.

బ్రిటీష్ పాలనను తలపించేలా చంద్రబాబు పాలన...

ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన బ్రిటిష్ పాలనను తలపించేదిగా ఉందని సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ అన్నారు. మీడియా ప్రతినిధులు కేసులపై అడిగిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ రెండు సంవత్సరాలు, మూడు సంవత్సరాల క్రితం జరిగిపోయిన కేసులు కూడా ఇప్పుడు ఎందుకు గుర్తుకువస్తున్నాయో అర్థం కావడం లేదని, రాష్ట్ర ప్రజలంతా పరిస్థితులు గమనిస్తున్నారని కిరణ్ అన్నారు. నాయకులు ఉడుతూరి ఓం ప్రకాష్ రెడ్డి, ఉప సర్పంచ్ బాపతు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బాపతు వెంకటరమణ, మెట్టు వెంకటప్పారెడ్డి, పిల్లి మేరీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

గుంటూరు రూరల్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఏటుకూరు బైపాస్ రోడ్డులోగల, నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం
- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతిజ్ఞలు



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించిన అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరం కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పొన్నూరులోని పార్టీ కార్యాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి అంబటి మురళీకృష్ణతో పాటు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేడ్కర్ దార్శనికతతో దేశం నేడు ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, పార్టీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, అంబటి వెంకటేశ్వరరావు, షేక్ నాజర్, షేక్ మాము, గేరా సంజీవ్, మూర్తిరాజు, ఎండేటి వెంకటసుబ్బయ్య, వట్టిప్రోలు రంగారావు, కార్యకర్తలు పాల్గొన్నారు. తౌలుత ఐలాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జైభీమ్ సమూహం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భవనం పద్మలీల, ఎంపీడీఓ చంద్రశేఖర్, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, ఆర్ఓ వెంకటేశ్వరరావు, ఉద్యోగులు, నాయకులు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.
- ఐలాండ్ సెంటర్‌లో జైభీమ్ సమూహం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు కమిషనర్ రమేష్‌బాబు, సీఐ రవి కిరణ్ బహుమతులు అందజేశారు. వేముల నిరీక్షణ రాజు, యడ్లవందనం, లక్ష్మీశ్రీనివాస్, గుమ్మడి రోశయ్య పాల్గొన్నారు.
- పట్టణంలోని మానవ హక్కుల వేదిక కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పౌర హక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ తూమాటి రాజారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ జీఎస్ రాయల్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ తూమాటి రమేష్, బీసీ హక్కుల సంఘం, గుడిసెవాసుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆకురాతి మురళీకృష్ణ, బొలగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెదకాకానిలో....

పెదకాకాని: మన స్వపరిపాలనకు ఆమోదముద్ర వేయడమే భారత రాజ్యాంగ దినోత్సవమని పెదకాకాని గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి అన్నారు. పెదకాకాని గ్రామంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మాతంగి నిర్మల, బంగారు మరియమ్మ, వార్డు సభ్యులు అమిరే సుజాత, పిల్లి రత్నకుమారి, మురికిపూడి రాజ్ పాల్ శేఖర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో...

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలోగల సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆచరణీయమైనదిగా, మార్గదర్శకంగా ఉందన్నారు. విద్యార్థులకు రాజ్యాంగంపై క్విజ్, వక్తృత్వం, సెమినార్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు తదితరులున్నారు.

కాకుమానులో...

కాకుమాను: ప్రతి విద్యార్థి భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. రాజ్యాంగ వజ్రోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తహసీల్దార్ బి.వెంకటస్వామి, ఎంపీడీఓ యుగకీర్తి, హెచ్ఎం బి.సత్యం.జవహర్‌రాణి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీపీ పద్మలీల



విద్యార్థులకు బహుమతులు అందించిన కమిషనర్ రమేష్‌బాబు, సీఐ రవికిరణ్

మండల పరిషత్ కార్యాలయంలో..

గుంటూరు రూరల్: భారత రాజ్యాంగంలో పేర్కొన్న ప్రాథమిక విధులు ప్రతి పౌరుడు బాధ్యతగా ఆచరించాలని డ్వామా పీడీ వి.శంకర్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా మండలంలోని గొర్లవారిపాలెం, మండల పరిషత్ కార్యాలయాల్లో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. గొర్లవారిపాలెం గ్రామ సర్పంచ్ నల్లమేకల అప్పమ్మ, మండల విస్తరణ అధికారి కె.శ్రీనివాసరావు, పరిపాలనాధికారి కె.విద్యాసాగర్‌రెడ్డి, అంబుస్ పర్సన్ కౌముది, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ శివన్నారాయణ, ఏపీఓ శ్రీరామ్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ప్రజలు తదితరులున్నారు.

గ్రామసభలకూ రాజకీయ రంగు

ప్రత్తిపాడు: గ్రామసభల నిర్వహణలోనూ అధికారులు రాజకీయం చేస్తున్నారు. కీలకమైన గ్రామసభలకు రాజకీయ రంగును పులుముతున్నారు. వైఎస్సార్ సీపీ అనుకూల వార్డు సభ్యుల పట్ల ఒక ధోరణిని, అధికార తెలుగుదేశం, జనసేన వార్డు మెంబర్ల పట్ల మరో ధోరణిని ప్రదర్శిస్తూ వివక్ష ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ ఆమోద దినోత్సవంను పురస్కరించుకుని భారత్ సంవిధాన్‌పై పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. గ్రామసభ నిర్వహణకు ముందుగా గ్రామంలో దండోరా వేయించడంతో పాటు విస్తృత ప్రచారం చేయించి గ్రామస్తులు అధిక సంఖ్యలో సభకు హాజరయ్యేలా అధికారులు చూడాలి. కానీ ఉదయం పదిన్నర గంటల వరకూ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు కూడా గ్రామ సభ సమాచారం తెలియదంటే అతిశయోక్తి కాదు. కూటమి వార్డు సభ్యులకు మాత్రం ముందుగానే ఉదయాన్నే సమాచారమిచ్చారని, వైఎస్సార్ సీపీ వార్డు సభ్యులకు ఉదయం 10.30 గంటలకు కూడా సమాచారం అందించలేదని కొందరు వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గ్రామ సర్పంచ్ లేకుండానే అధికారులు గ్రామసభను జరిపారు. వాస్తవానికి గ్రామసభ కచ్చితంగా సర్పంచ్ అధ్యక్షతన జరగాలి. సర్పంచ్ సెలవులో ఉంటే ఉపసర్పంచ్ అధ్యక్షతన జరపాలి. వారిరువురూ లేకుంటే వార్డుసభ్యుల అధ్యక్షతనైనా గ్రామసభను జరపాల్సి ఉంది. కానీ ఇవేమీ జరగలేదు. ముందస్తుగా సకాలంలో వార్డుసభ్యులకు సమాచారం లేకపోవడంతో సర్పంచ్‌తో పాటు పద్నాలుగు మంది వార్డు సభ్యులు హాజరు కాలేదు. పదిహేను వేల మంది జనాభా ఉన్న ప్రత్తిపాడు గ్రామ పంచాయతీలో గ్రామ సభకు సచివాలయ ఉద్యోగులు కాకుండా హాజరైన వారు ఇద్దరంటే ఇద్దరంటే ఆశ్చర్యం కలుగకమానదు.



ప్రత్తిపాడులో జనం రాకపోవడంతో సచివాలయ ఉద్యోగులను కూర్చోబెట్టి నిర్వహిస్తున్న గ్రామసభ

అత్తింటి ముందు కోడలు ఆందోళన



పొన్నూరు: అత్తింటి వారు అధిక కట్నం కోసం వేధిస్తూ తనను కాపురానికి రానివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కోడలు ఆరెమండ గ్రామంలోని అత్తింటి ముందు గత రెండు రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. సేకరించిన వివరాల ప్రకారం... పొన్నూరు మండలం కట్టెంపూడికి చెందిన మౌళికకు ఆరెమండకు చెందిన మొగలాయిబాబుతో రెండేళ్ల క్రితం వివాహమైంది. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా అత్త, ఆడపడుచు వరకట్నం కోసం వేధిస్తున్నారని, మౌళికను కాపురానికి రాకుండా అడ్డుకుంటున్నారని మౌళిక కుటుంబ సభ్యులు వాపోయారు. ఎక్కడికి వెళ్లినా తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా తన ఇంటి ముందు కూర్చుని న్యాయం చేయాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. న్యాయం కోసం పోలీసుల వద్దకు వెళ్లినా న్యాయం జరగలేదని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వద్దకు వెళ్లి న్యాయం చేయాలని కోరతామని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది.